




# కరపత్రం

SINCE 2014

గురువారం జూలై 23, 2026 | సంపుటి : 2 | సంచిక : 281 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




## కాంగ్రెస్ ఓట్లు తొలగించేవందెకు
# బిజెపి ఎత్తులు

### కొడంగ్‌లో నన్ను దెబ్బతీయాలని కుట్రలు

- ఓట్లు పోకుండా జాగ్రత్తలు తీసుకోండి
- సర్‌పై బూత్‌లెవల్ కార్యకర్తలతో సిఎం రేవంత్



**వికారాబాద్,జూలై22 :**
కొడంగల్ ప్రజలు, కార్యకర్తల ఆశీర్వాదంతోనే కాంగ్రెస్‌కు రాష్ట్రానికి నాయకత్వం వహించే అవకాశం వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం కొడంగల్‌లో పర్యటించిన సీఎం.. స్థానిక నాయకులు, బీఎల్‌ఏలతో సర్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'కొడంగల్‌లో నన్ను దెబ్బతీయాలని కుట్రలు చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో దెబ్బతీయాలంటే పునాదులు దెబ్బతీయాలని చూస్తున్నారు. పేర్లు వేరైనా బీఆర్‌ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే. కొడంగల్‌లో కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లు తొలగించాలని చూస్తున్నారు. ఇంట్లో పొగ పెడితే రేవంత్ రెడ్డి బయటకు రాకుండా ఉంటారని కుట్రలు చేస్తున్నారు. ఎదురు నిలబడలేక దొంగదెబ్బ తీయాలని కుట్ర చేస్తున్నారు. కొడంగల్‌లో కుట్రలు చేసేవారిని బొంద పెట్టే బాధ్యత మీపై ఉందని సిఎం అన్నారు. 119 నియోజకవర్గాలను అభివృద్ధి చేయడం కోసం రోజుకు 18 గంటలు పనిచేసినా సమయం సరిపోవడంలేదని సీఎం తెలిపారు. ఆగస్టు 3 వరకు సర్ గడువు ఉందన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం 2,51,255 ఓట్లున్నాయని.. కానీ 1,96,626 ఓట్లు మాత్రమే సర్‌లో నమోదు చేసుకున్నారని.. మిగిలిన 54,635 నమోదు చేసుకోలేదని సీఎం తెలిపారు. మొత్తం ఓట్లలో ఇంకా 22 శాతం నమోదు జరగలేదని చెప్పారు. ఆ ఓట్లను తొలగిస్తే ప్రమాదం పొంచి ఉందన్నారు. వారందరినీ తిరిగి నమోదు చేయించాల్సిన బాధ్యత బీఎల్‌ఏలపై ఉందన్నారు.

మిగతాద్ది 2 లో




2లో..

## కాంగ్రెస్ అగ్రనేతల
# అరెస్ట్‌కు నిరసన

- కొడంగ్‌లో రేవంత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సిఎం డిమాండ్

# తెలంగాణకు కేంద్రం గుడ్ న్యూస్

**ఢిల్లీ:**
రైతుల ప్రయోజనాల దృష్ట్యా కేంద్రం.. కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో అదనంగా వడ్లను కొనుగోలు చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా 8 లక్షల మెట్రిక్ టన్నులు (బియ్యం రూపంలో) పెంచేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది.

2 లో

# కాంగ్రెస్, బిజెపి పోటాపోటీ ఆందోళనలు

- లోక్‌భవన్ ముట్టడికి కాంగ్రెస్ యత్నం
- గాంధీభవన్ ముట్టడికి బిజెపి నేతల దూకుడు
- ఇరువర్గాల పరస్పరం దాడులతో ఉద్రిక్తత
- రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేసిన పోలీసులు
- నగరంలో పలువురు కాంగ్రెస్, బిజెపి నేతల అరెస్ట్



2 లో



**హైదరాబాద్,జూలై22 :**
కాంగ్రెస్, బీజేపీ ఆందోళనలతో బుధవారం హైదరాబాద్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లోక్‌భవన్ ముట్టడికి పిలుపునివ్వగా, మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ నివాసం ఎదుట కాంగ్రెస్ చేపట్టిన నిరసనను ఖండిస్తూ బీజేపీ నాయకులు గాంధీభవన్ ముట్టడికి




# ట్రైనీ ఉదయ్ కృష్ణారెడ్డి కేసు విచారణ

- సోమవారానికి వాయిదా వేసిన హైకోర్టు
- విచారణకు రంగంలోకి దిగిన ఉమెన్ సేఫ్టీ డిసిపి లావణ్య

**హైదరాబాద్:**
ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి పిటిషన్‌పై విచారణను హైకోర్టు సోమవారానికి వాయిదా వేసింది.

# రాహుల్ అరెస్ట్‌కు నిరసనలు

» హన్మకొండలో ఆందోళనలో పాల్గొన్న భట్టి, కొండా సురేఖ

» కేంద్రం తీరుపై మండిపడ్డ డిప్యూటి సిఎం భట్టి



**హన్మకొండ,జూలై22**
కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎంపీ ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలను కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా అరెస్ట్ చేయడాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టు ను నిరసిస్తూ హన్మకొండ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంత్రి కొండ సురేఖతో కలిసి భట్టి విక్రమార్క తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి ముందు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజుతో పాటు పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మిగతాద్ది 2 లో

# పదేళ్లలో 152 పేపర్ లీక్ కేసులు



- ఒక్క కేసులో కూడా దోషులను తేల్చలేదు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే
- ప్రధాని మోడీ క్షమాపణలు చెప్పాల్సిందే
- మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ డిమాండ్

**న్యూఢిల్లీ,జూలై22 :**
గత 10 ఏళ్లల్లో 152 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయని కాంగ్రెస్ నేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒక్క కేసులో కూడా దోషులు ఎవరో తేలలేదని అన్నారు. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై ఉద్యమిస్తున్న యువతకు మద్దతుగా రాహెల్ గాంధీ బుధవారం ఏర్పాటు చేసిన పత్రికాసమావేశంలో కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో విద్యావ్యవస్థ మొత్తం రిగ్గింగ్ బారిన పడిందని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పనితీరు అసమర్థంగా, అవినీతిమయంగా ఉందని ఆరోపించారు. ఆయన రాజీనామా చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఆయన రాజీనామాకు విద్యార్థులు పట్టుబడుతున్నారని, ఇది సరైన డిమాండేనని వ్యాఖ్యానించారు. ఈ దుస్థితికి ప్రతిబింబంగా మారిన ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకోవాల్సిందేనని తేల్చి చెప్పారు. గత పదేళ్లల్లో సుమారు 152 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయి. అంటే.. సగటున వారానికి ఒక పేపర్ లీక్ జరిగింది. కోట్ల మంది విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడింది. కానీ ఒక్క కేసులో కూడా దోషులెవరో తేలలేదు. ఇలా ఎందుకు జరిగిందని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఒకప్పుడు దేశానికి సంపదగా ఉన్న విద్యారంగం ఎన్డీయే పాలనలో ధ్వంసమైందని రాహుల్ గాంధీ ఆరోపించారు.

మిగతాద్ది 2 లో



2లో..

## బిజెపి కార్యాలయం
# వద్ద ఉద్రిక్త పరిస్థితి

- రామచంద్రరావు, ఎమ్మెల్యే రాకేశ్‌ల ముందస్తు అరెస్ట్
- కరీంనగర్‌లో బండి కార్యాలయంపై దాడికి యత్నం

**హైదరాబాద్,జూలై22 :**
కాంగ్రెస్, బిజెపిల ఆందోళనలో భాగంగా హైదరాబాద్ బిజెపి కార్యాలయం వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. గాంధీభవన్ ముట్టడికి బీజేపీ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో బీజేపీ నేతలు పోలీసుల చర్యలను వ్యతిరేకిస్తూ నిరసనకు దిగారు. నేతల అరెస్టుల సందర్భంగా పోలీసులకు, బీజేపీ కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆందోళన

» హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో పొన్నం ఆందోళన

**సిద్దిపేట,జూలై22 :**
కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలోమంత్రి పొన్నం ప్రభాకర్ ధర్నాకు దిగారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే , ప్రియాంక గాంధీ, ఇతర ఎంపీలు మరియు




2లో..

# నీట్‌పై కేంద్ర వైఖరి దారుణం

- విద్యార్థులపై లాఠీఛార్జీ అమానుషం
- రాహుల్‌కు మద్దతుగా నిత్యం ఆందోళనలు
- కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి వెల్లడి

**సంగారెడ్డి,జూలై22 :**
మూడో సారి ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదని టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి విమర్శించారు.



2లో..

# సిసిఐ పునరుద్దరణపై మీ వైఖరి ఏంటి

- జిల్లా అభివృద్ధికి సిమెంట్ ఫ్యాక్టరీ అతి ముఖ్యం
- సిఎం రేవంత్‌కు బిఆర్ఎస్ నేత కెటిఆర్ లేఖ

**హైదరాబాద్,జూలై22 :**
ఆదిలాబాద్ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ పునరుద్ధరణపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఆదిలాబాద్ అభివృద్ధికి సీసీఐ పునరుద్ధరణ కీలకమని.. రూ.250 కోట్ల రాష్ట్ర వాటాతో పునరుద్ధరణ సాధ్యమేనని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు.



2లో..

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం జూలై 23, 2026

# కాంగ్రెస్ అగ్రనేతల అరెస్ట్‌కు నిరసన

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ తదితరుల అరెస్ట్‌ను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టింది. కొడంగల్ ర్యాలీలో సిఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాలను అమ్ముకుంటున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఢిల్లీలో నిన్న రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టును వ్యతిరేకిస్తూ కొడంగల్‌లోని అంబేడ్కర్ కూడలిలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈసందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... నీట్ ప్రశ్నపత్రాలను పల్లీబఠానీల్లా కోట్ల రూపాయలకు అమ్ముకున్నారని ధ్వజమెత్తారు. రాజకీయ పార్టీలకతీతంగా దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయని, ప్రజా ఆందోళనలు పరిగణనలోకి తీసుకుని ధర్మేంద్ర ప్రదాన్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రాలు అమ్ముకున్న వారిని అరెస్టు చేసి జైల్లో పెట్టాలన్నారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ధర్మేందప్రదాన్ చెలగాటం ఆడారు. ఆయన రాజీనామా చేయాలని దిల్లీలో యువత ఆందోళన చేపట్టింది. పార్లమెంటరీ వ్యవస్థలో ప్రజా సమస్యల్ని ప్రస్తావించడం ప్రజాప్రతినిధుల బాధ్యత. 20వ తేదీ నుంచి ప్రారంభమైన పార్లమెంట్ ఉభయసభల్లో.. ప్రశ్నపత్రాల లీకేజీ అంశంపై చర్చించాలని కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి అడిగినా ప్రభుత్వం అనుమతించడం లేదు. లోక్‌సభ స్పీకర్ అంగీకరించడం లేదు. ప్రజాస్వామ్యానికి ఇది దురదృష్టకరమైన పరిస్థితి. దిల్లీ పోలీసులు రాహుల్‌గాంధీని కొడితే ఆయన ముక్కులో నుంచి రక్తం కారింది. ఈ దేశం కోసం రక్తం చిందించడంలో రాహుల్ గాంధీ మొదటివారు కాదు.. చివరివారూ కాదు. ఆనాడు మహాత్మాగాంధీ తెల్లదొరలతో కొట్లాడి దేశానికి స్వాతంత్య్రం తెచ్చారు. గాంధీజీని పొట్టన పెట్టుకున్న గాడ్సే వారసులు మీరు అంటూ భాజపాపై తీవ్ర విమర్శలు చేశారు.

అంబేద్కర్ అందించిన రాజ్యాంగం సాక్షిగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై కేంద్ర ప్రభుత్వ, పోలీసుల పాశవిక దాడికి ఖండిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్‌తో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు.విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడారని మండిపడ్డారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను అరెస్టు చేసి, పేపర్ లీక్ చేసిన వాళ్లను జైల్లో పెట్టాల్సింది పోయి.. విద్యార్థులపై పాశవిక దాడి జరిపారని ఫైర్ అయ్యారు. ఆడపిల్లలపై దాడి చేశారని.. విద్యార్థుల తలలు పగలగొట్టారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పదుల సంఖ్యలో విద్యార్థులు కనిపించడంలేదని, వారిని ఎక్కడికైనా తీసుకెళ్లారా? లేక కిడ్నాప్ చేశారో తెలియదన్నారు. విద్యార్థులకు మద్దతుగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ.. ప్రధాని ఇంటి ముందు నిరసన చేపట్టారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కు అని చెప్పుకొచ్చారు. పేపర్ లీక్‌పై పార్లమెంటులో చర్చ జరగకుండా అడ్డుకున్నారని.. రాహుల్ గాంధీపై పాశవిక దాడితో ఆయన రక్తం నేలకు చిందిందన్నారు. దేశం కోసం రక్తం చిందించడం గాంధీ కుటుంబానికి కొత్త కాదని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్నా సోనియా గాంధీ ప్రధాని పదవి తీసుకోలేదని.. మంత్రి పదవి కూడా చేపట్టలేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రతిపక్ష నాయకుడిగా ఖర్గేను నియమించారు తప్ప పదవులు తీసుకోలేదని చెప్పుకొచ్చారు. 2019 ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా అవకతవకలకు పాల్పడి విద్యార్థుల ప్రాణాలు బలిగొందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణలో పప్పులు ఉడకవని పేరు మార్చుకుని గ్లోబరీనా సంస్థ కేంద్రం వద్దకు వెళ్లిందని.. అప్పుడే ఆ సంస్థపై క్రిమినల్ కేసులు పెట్టి ఉంటే ఇప్పుడు ఇలా జరిగి ఉండేది కాదన్నారు. నీట్ పరీక్ష నిర్వహించడంతో దొంగతనం చేయొచ్చన్న ధైర్యం వాళ్లకు వచ్చిందని విమర్శించారు. అః౼ూఇలో జరిగిన అక్రమాలు, నీట్ పరీక్ష పేపర్ లీకేజ్‌పై విద్యార్థులు నిరసన తెలిపారని అన్నారు. లాఠీలు కాంగ్రెస్‌కు కొత్త కాదని.. ఆంగ్లేయులతో పోరాడి తరిమికొట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. దేశాన్ని దోచుకుంటుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. యువత పక్షాన నిలిచి మోదీపై పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అందరం కలిసి పోరాటం చేసి మోదీని గద్దె దించి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుందామని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తొలుత రేవంత్‌రెడ్డి నివాసం నుంచి కొడంగల్‌లోని అంబేద్కర్ కూడలి వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో స్థానిక నేతలు భారీ ఎత్తున పాల్గొన్నారు. బిజెపికి, కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# కాంగ్రెస్, బిజెపి పోటాపోటీ ఆందోళనలు

మొదటిపేజీ తరువాయి

దీంతో ఇరువర్గాలు ముట్టడికి బలయుదేరడంతో పాటు పరస్పర దాడులకు తెగించారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాహుల్ గాంధీ అరెస్ట్‌ను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు చేస్తున్న నిరసనలతో నాంపల్లి బీజేపీ కార్యాలయం దగ్గర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ ఆఫీస్ ముట్టడికి కాంగ్రెస్ నేతలు యత్నించారు. కాంగ్రెస్ నేతలు రాకుండా బీజేపీ నేతలు కర్రలతో అడ్డుకున్నారు. మరోపక్క.. రాజ్ భవన్ ముట్టడికి యత్నించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు నాంపల్లి పీఎస్‌కు తరలించారు. కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి నాంపల్లి పీఎస్‌కు చేరుకున్నారు. ఖైరతాబాద్‌లో కూడా కాంగ్రెస్ ఆందోళనకు దిగింది. నెక్లెస్ రోడ్డులోని ఐమాక్స్ సమీపంలో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం దగ్గరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరుకున్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లోక్ భవన్ ముట్టడికి యత్నించిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఘటనా స్థలంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్దకు చేరుకున్న బీజేపీ నాయకులను అక్కడే అడ్డుకున్నారు. అలాగే లోక్‌భవన్ వైపు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఖైరతాబాద్ సర్కిల్ వద్ద నిలువరించారు. ఈ క్రమంలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ రాష్ట్ర కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కర్రలతో దాడులు జరిగాయని, కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసు వాహనాలపైకి ఎక్కి నిరసన వ్యక్తం చేసినట్లు సమాచారం. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు తీవ్రంగా శ్రమించారు. ముందస్తు చర్యల్లో భాగంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. తొలుత కాంగ్రెస్ నేతలు హైదరాబాద్ నెక్లెస్‌రోడ్ నుంచి లోక్‌భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అజారుద్దీన్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ర్యాలీ లోక్‌భవన్‌కు చేరుకున్న వెంటనే మంత్రులు, కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో కరీంనగర్‌లో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కేంద్రమంత్రి బండి సంజయ్ ఇంటిని ముట్టడించేందుకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లగా... వారిని బీజేపీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా అడ్డుకున్నారు. చేతుల్లో కర్రలతో బండి సంజయ్ ఇంటికి బీజేపీ నేతలు కాపలాగా నిలవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. బీజేపీ నేతలపై కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లు, చెప్పులతో దాడులకు తెగబడ్డారు. ఇరుపార్టీల కార్యకర్తలు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో కరీంనగర్ వీధులు రణరంగాన్ని తలపించాయి. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఉద్రిక్తతలను అదుపు చేసేందుకు లాఠీలకు పనిచెప్పారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను చెదరగొట్టి, పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా... కాంగ్రెస్ దాడికి నిరసనగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు బీజేపీ శ్రేణులు యత్నించాయి. అయితే వారిని కాంగ్రెస్ నేతలు అడ్డుకోవడంతో మరోసారి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రెండు ప్రధాన పార్టీల సవాల్-ప్రతిసవాల్‌తో కరీంనగర్‌లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు.

# పదేళ్లలో 152 పేపర్ లీక్ కేసులు

మొదటిపేజీ తరువాయి

పేద, మధ్యతరగతి వర్గాలకు విద్య భారంగా మారిందని చెప్పారు. కోచింగ్‌పై నీట్ అభ్యర్థుల వార్షిక ఖర్చు రూ.1.32 లక్షల కోట్లని అన్నారు. ఇది విద్యారంగం వార్షిక బ్జడెట్ రూ.1.42 లక్షల కోట్లకు దాదాపు సమానమని వ్యాఖ్యానించారు. సంపన్నుల కోసమే ఉద్దేశించిన ఈ వ్యవస్థలో పేదలకు స్థానం లేదని అన్నారు. సోమవారం నిరసనల సందర్భంగా విద్యార్థులపై లాఠీ చార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రధాని మోదీ విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సిందేనని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. విద్యార్థుల విషయంలో ఏం జరుగుతోంది. పారదర్శకమైన విద్యా వ్యవస్థ కావాలని యువత కోరుతోంది. కానీ, ఈ ప్రభుత్వం శాంతియుతంగా నిరసనలు చేస్తున్న వారిపై లాఠీఛార్జ్ చేయించింది. మధ్యతరగతి కుటుంబాలకు చదువు ఆర్థిక భారంగా మారింది. విద్యపై రూ.1.4లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయించినట్లు కేంద్రం చెబుతోంది. కానీ, గత దశాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా 152 పరీక్షల పత్రాలు లీక్ అయ్యాయి. దీని వల్ల 7.50కోట్ల మంది విద్యార్థులు నష్టపోయారు. విద్యార్థులు ఎంత బాధపడుతున్నా.. ఈ ప్రభుత్వం లెక్కచేయట్లేదు. ఈ పేపర్ లీకేజీ ఘటనల్లో ఇప్పటివరకు శిక్షపడిన నేరస్థుల సంఖ్య సున్నా అని రాహుల్ విమర్శించారు. దేశ యువతకు ఉద్యోగాలు లేవు. విద్యార్థుల ఆశలు, ఆకాంక్షలను ఈ ప్రభుత్వం నాశనం చేస్తోంది. మన దేశంలో చైనా వస్తువుల సంఖ్య పెరిగింది. పరిశ్రమలు మూతపడుతున్నాయి. బ్యాంకులను బడా వ్యాపారులు లూటీ చేస్తున్నారు. ఏఐ వల్ల కార్పొరేట్ రంగంలో ఉద్యోగాలు పోతున్నాయి. కేంద్రం విధానాల వల్ల పేదలు, విద్యార్థులు నష్టపోతున్నారు. విద్యార్థులంటే మనకు శత్రువులు కాదు. ఈ దేశ భవిష్యత్తు అన్న విషయం కేంద్రం గుర్తుంచుకోవాలని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద ప్రధాన్ పూర్తిగా విఫలమయ్యారు. లీకేజీకి బాధ్యత వహిస్తూ ఆయన రాజీనామా చేయాలని యువత డిమాండ్ చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి జవాబుదారీతనాన్ని యువత కోరుకుంటోంది. ఆందోళన చేస్తోన్న యువతపై దాడి చేసిన వారికి శిక్ష పడాలని కోరుతోంది. ఇక, ఈ వైఫల్యాలకు గానూ ప్రధాని క్షమాపణలు చెప్పాలని వారు కోరుతున్నారు. విద్యార్థుల డిమాండ్లకు మేం పూర్తి మద్దతు ప్రకటించాం అని రాహుల్ వెల్లడించారు. విద్యార్థుల ఆందోళనను మేం రాజకీయాలకు వాడుకోవట్లేదు. ప్రతిపక్ష నేతగా ప్రజల గళం వినిపించడం నా బాధ్యత. దీనిపై పార్లమెంట్‌లో మాట్లాడేందుకు కేంద్రం అవకాశం ఇవ్వట్లేదు. అందుకే విద్యార్థులకు మద్దతుగా వీధుల్లోకి వచ్చాం. నిన్న నిరసనల్లో నా పట్ల జరిగిన దానికి బాధపడటం లేదు. విద్యార్థులకు జరుగుతోన్న నష్టం విషయంలోనే బాధగా ఉంది. పరీక్షల విధానంలో మార్పులు రావాలి. ప్రజల కోసం ఎన్ని దెబ్బలు తినేందుకైనా నేను సిద్ధం అని కాంగ్రెస్ ఎంపీ తెలిపారు

## సిసిఐ పునరుద్దరణపై మీ వైఖరి ఏంటి

మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపకపోవడమే జాప్యానికి కారణమన్న కేటీఆర్ సీసీఐ పునరుద్ధరణపై రేవంత్ ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో చేసిన ప్రతిపాదనలను ప్రస్తావించారు. ఆదిలాబాద్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. రెండున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ చిత్త శుద్ధి లోపం వల్లే జాప్యం జరిగిందని.. సీసీఐపై ఆరు కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇటీవలే సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీసీఐ సాధన సమితి బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర భారీ పరిశ్రమలు / ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసిందని తెలిసిందే. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి మాజీ మంత్రి జోగురామన్న, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతోపాటు సీసీఐ సాధాన సమితి సభ్యులను అందరినీ తీసుకొని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామిని కలిశాం. 1980వ దశకంలో ఏర్పాటు చేయబడ్డ సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ఎ÷-లాంట్ ఒకదశలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 6 వేల మందికి ఉద్యోగాలు కల్పించిందని అన్నారు. రాబోయే 100 సంవత్సరాల వరకు మీకు మైన్ స్టోన్ రిజర్వ్‌లు కూడా మీకు ఉన్నాయి. 4 లక్షల మెట్రిక్ టన్నుల కెపాసిటీతో ఉన్న ఈ ఎ÷-లాంట్‌ను నడిపేందుకు అవకాశాలు సంపూర్ణంగా ఉన్నాయన్నారు. గతంలో 2019లో కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా మాటిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఈ ప్లాంట్‌ను తప్పకుండా తెరిపిస్తామని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చెప్పారు. ప్లాంట్‌ను తెరిపిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం కూడా మాటిచ్చారు. కానీ ఈ రోజు ఆదిలాబాద్ సీసీఐని తుక్కు కింద అమ్మేస్తున్నరని వారికి వివరంగా చెప్పడం జరిగిందన్నారు.

## బిజెపి కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి

మొదటిపేజీ తరువాయి

కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేశారు. బీజేపీ నాయకుల అరెస్టుపై పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నివాసం ఎదుట మంగళవారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆందోళన చేశారు. దీనికి నిరసనగా బీజేపీ అగ్రనేతలు గాంధీభవన్‌ను ముట్టడించాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో బీజేపీ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో హై టెన్షన్ నెలకొంది. కరీంనగర్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కార్యాలయం వద్ద కూడా ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు బండి సంజయ్ కార్యాలయం వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో అక్కడ భారీగా పోలీసులు మోహరించారు. కాంగ్రెస్ నేతలను అడ్డుకునే క్రమంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. నంతరం కాంగ్రెస్ కార్యకర్తలు బండి సంజయ్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. దీంతో ఆఫీసు పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్తత కొనసాగింది. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు. రాష్ట్రంలో ఒకే రోజు బీజేపీ రాష్ట్ర కార్యాలయం, కేంద్ర మంత్రి బండి సంజయ్ కార్యాలయం వద్ద చోటుచేసుకున్న ఈ పరిణామాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. పోలీసులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపడుతున్నారు.

### కాంగ్రెస్ ఓట్లు తొలగించేవందెకు

# బిజెపి ఎత్తులు

మొదటిపేజీ తరువాయి

ఓటు పోగొట్టుకుంటే గుర్తింపు ఉండదని సీఎం తెలిపారు. ఓటు లేకుంటే చనిపోయిన వారితో సమానమన్నారు. కార్యకర్తగా ఇంటింటికీ వెళ్లి ఓటరు వెరిఫికేషన్ ఫారం నమోదు చేయించాలని నేతలకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఓట్లు తొలగించాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటై కాంగ్రెస్‌ను దొంగదెబ్బ తీయాలని గూడుపుఠాణి చేస్తున్నాయని మండిపడ్డారు. ఓటర్ల వివరాలు ఎన్నికల అధికారులకు అందించాల్సిన బాధ్యత బూత్ లెవెల్ ఏజెంట్లపైనే ఉందన్నారు. ఈనెల 30లోగా నూటికి నూరు శాతం కొడంగల్ నియోజకవర్గంలో ప్రక్షాళన పూర్తి కావాలని తెలిపారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ ఓటు కోల్పోవడానికి వీల్లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## ట్రైనీ ఉదయ్ కృష్ణారెడ్డి కేసు విచారణ

మొదటిపేజీ తరువాయి

కేసుకు సంబంధించిన వివరాలు సమర్పించాలంటూ పోలీసులను ఆదేశించింది. పిటిషనర్ ట్రైనీ ఐపీఎస్ గా ఉన్నారని.. అప్పటి వరకు తదుపరి చర్యలు చేపట్టకుండా పోలీసులను ఆదేశించాలంటూ అతని తరఫు న్యాయవాది కోరినా హైకోర్టు అంగీకరించలేదు. తప్పుడు ఆరోపణలతో పోలీసులు కేసు నమోదు చేశారని, ఆ కేసును కొట్టివేయాలని ఉదయ్ కృష్ణారెడ్డి పిటిషన్‌లో కోరారు. తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదు మేరకు అతనిపై అత్తాపూర్ పీఎస్‌లో కేసు నమోదైంది. లైంగికంగా వేధించడంతో పాటు.. వ్యక్తిగత వీడియోలను తన భర్తకు పంపించి ఇబ్బందులకు గురి చేశాడని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసు దర్యాప్తులో పోలీసులు వేగం పెంచారు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసును పోలీసు ఉన్నతాధికారులు ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు బదిలీ అనంతరం డీసీపీ లావణ్య బుధవారం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీకి చేరుకుని దర్యాప్తు ప్రక్రియను ప్రారంభించారు. కేసులో ఫిర్యాదు చేసిన ట్రైనీ ఐపీఎస్ అధికారి వాంగ్మూలాన్ని నమోదు చేయడానికి ఆమె అకాడమీకి వెళ్లారు. అకాడమీలో ఉన్నతాధికారుల సమక్షంలో ట్రైనీ ఐపీఎస్ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయనున్నారు. ఈ వాంగ్మూలం కేసు దర్యాప్తులో అత్యంత కీలకంగా మారే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలు, అందుబాటులో ఉన్న డిజిటల్, ఇతర ఆధారాలు, సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలను సమగ్రంగా పరిశీలించనున్నారు.మహిళా భద్రతకు సంబంధించిన అంశం కావడంతో ఈ కేసును ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు బదిలీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కేసు దర్యాప్తు సమయంలో అకాడమీలోని అధికారులు, సహచర ట్రైనీలు, ఇతర సంబంధిత వ్యక్తుల వివరాలను కూడా సేకరించే అవకాశం ఉంది. కేసుకు సంబంధించిన అన్ని కోణాలను పరిశీలించి వాస్తవాలను ప్రత్యేక దర్యాప్తు బృందం వెలుగులోకి తీసుకురానుంది. డీసీపీ లావణ్యా నాయక్ జాదవ్ స్వయంగా పర్యవేక్షిస్తున్న ఈ విచారణలో ట్రైనీ ఐపీఎస్ అధికారి ఇచ్చే వాంగ్మూలం కీలక ఆధారంగా మారనుంది. ఈ తాజా పరిణామాలతో ఉదయ్ కృష్ణారెడ్డి కేసు దర్యాప్తు మరింత వేగం పుంజుకునే అవకాశం ఉంది.

## తెలంగాణకు కేంద్రం గుడ్ న్యూస్

మొదటిపేజీ తరువాయి

సవరించిన వరి కొనుగోలు అంచనా బియ్యం రూపంలో 43 లక్షల మెట్రిక్ టన్నులు గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.తెలంగాణ నుంచి అదనపు బియ్యం సేకరణకు కేంద్రం నిర్ణయంపై కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ హర్షం వ్యక్తం చేశారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రైతుల మేలు కోసం, బీజేపీ ప్రజాప్రతినిధుల విజ్ఞప్తులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు.ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2025-26కు సంబంధించి, సీజన్ ప్రారంభానికి ముందే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల సమక్షంలో తెలంగాణ నుంచి 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం (52 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం) సేకరించాలని సంయుక్తంగా నిర్ణయించారు. తెలంగాణలో ఈసారి ధాన్యం ఉత్పత్తిని దృష్టిలో పెట్టుకుని, తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి 8 జూలైనాడు కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ప్రజాపంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో సమావేశమై.. తెలంగాణ నుంచి బియ్యం సేకరణ పరిమాణాన్ని పెంచాలని విజ్ఞప్తి చేశాం.
మా విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం, బియ్యం సేకరణ లక్ష్యాన్ని 35 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 43 లక్షల మెట్రిక్ టన్నులకు (అంటే 64 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యానికి సమానం) పెంచుతూ నిర్ణయం తీసుకుంది. తెలంగాణకు 8 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు బియ్యం సేకరణకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించడాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కిషన్‌రెడ్డి కోరారు.

## కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆందోళన

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల అరెస్టులను నిరసిస్తూ మహాధర్నా నిర్వహించడం జరిగింది. ఢిల్లీలో విద్యార్థులు చేపట్టిన శాంతియుత పార్లమెంట్ మార్చ్‌పై జరిగిన లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పొన్నం తెలిపారు.. నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించి సమాధానం చెప్పాలి. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. నీట్ అంశంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరపాలి. పేపర్ లీకేజీపై కేంద్ర హోంమంత్రి సమాధానం చెప్పాలి. ఈ ఘటనల కారణంగా ఆత్మహత్యలకు పాల్పడ్డ విద్యార్థుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించాలి. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌పై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులతో నిరసన. మహా ధర్నాలో అన్ని మండలాల అధ్యక్షులు, సర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం, న్యాయం కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మా పోరాటం కొనసాగుతుందని మంత్రి హెచ్చరించారు.

## నీట్‌పై కేంద్ర వైఖరి దారుణం

మొదటిపేజీ తరువాయి

బుధవారం సంగారెడ్డిలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. గత మూడు రోజులుగా ఢిల్లీలో నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ వేలాది మంది యువత ఆందోళన బాట పట్టారని చెప్పారు. ఆందోళనకు దిగిన వారిని దారుణంగా రక్తం వచ్చేలా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ.. ప్రధాని మోదీ నివాసాన్ని ముట్టడిస్తే.. ఆయన్ని కూడా అరెస్ట్ చేశారని అన్నారు.విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని.. అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని రాహుల్ డిమాండ్ చేశారని జగ్గారెడ్డి తెలిపారు. రాహుల్ గాంధీకి మద్దతుగా మంగళవారం హైదరాబాద్ - ముంబై నేషనల్ హైవే ముట్టడించామన్నారు. బుధవారం నల్ల దుస్తులతో నిరసన ర్యాలీ చేశామని చెప్పారు. గురువారం కూడా ఆందోళన చేస్తామని ఆయన స్పష్టం చేశారు. బ్లాక్ టీషర్ట్‌లు ధరించిన వెయ్యి మంది కాంగ్రెస్ కేడర్‌తో ఈ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. రాహుల్, ప్రియాంకలతోపాటు విద్యార్థులకు మద్దతుగా ప్రతి రోజు నిరసన కార్యక్రమాలు చేపడతామని వివరించారు. రాహుల్ గాంధీ ఆందోళన చేసినన్ని రోజులు సంగారెడ్డిలో ఆందోళనలు జరుగుతూనే ఉంటాయని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

## రాహుల్ అరెస్ట్‌కు నిరసనలు

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతలను కర్కశంగా అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని తీవ్రంగా అవమానించడమేనని మండిపడ్డారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీతో దేశంలోని కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైందని, ఈ అక్రమాలపై ప్రశ్నిస్తూ ఆందోళన చేస్తున్న అమాయక విద్యార్థులు, ఆడపిల్లల పట్ల పోలీసులు విచక్షణారహితంగా వ్యవహరించి లాఠీఛార్జ్ చేయడం అత్యంత దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీకి పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వ హయాంలో దేశంలో అరాచక పాలన సాగుతోందని, ప్రజల సమస్యలు వినడం మానేసి ప్రశ్నించిన వారిపై దాడులు, అరెస్టులు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. లాఠీలతో విద్యార్థుల గొంతును, అరెస్టులతో రాహుల్ గాంధీ పోరాటాన్ని కేంద్ర ప్రభుత్వం ఆపలేదని స్పష్టం చేశారు. దేశ యువత భవిష్యత్తు కోసం, విద్యా వ్యవస్థను కాపాడుకోవడానికి రాహుల్ గాంధీ దిక్సూచిలా నిలిచి పోరాడుతున్నారని.. కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్షాలు విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆఖరి వరకు పోరాడతాయని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ చేపడుతున్న ఈ పోరాటానికి దేశంలోని ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు.

# నీట్ పేపర్ లీకేజీ నిన్నటి వార్త

# పంజాబ్ లో ఫార్మసీ పరీక్ష పత్రం లీకేజీ నేటి వార్త

**కరపత్రం బ్యూరో, హైదరాబాద్**

నీట్ పేపర్.. NEET PAPER లీకేజీ పేరుతో అమెరికా నుండి ఇండియా వరకు జరిగిన కుట్రలు డిల్లీ వీధుల్లో అలజడి రేపుతున్నాయి. ఈ ప్రహసనం కొనసాగుతున్న సమయంలో పంజాబ్ లో ఫార్మసీ ఆఫీసర్స్ రిక్రూట్ మెంట్ ఎగ్జామ్ పేపర్ లీకేజీ పంజాబ్ రాష్ట్రాన్ని ఒక ఊపు ఊపుతున్నది. ఈ నీట్ "కాకుల గోల"లో పంజాబ్ లీకేజీ కూడా జత కలిసింది. పంజాబ్‌లో ఫార్మసీ ఆఫీసర్ రిక్రూట్‌మెంట్ పరీక్ష క్వశ్చన్ పేపర్ లీక్ అయ్యిందంటూ వస్తున్న వార్తలపై పంజాబ్ పోలీసులు కీలక వివరణ కూడా ఇచ్చారు.

- **ఈ పరీక్ష ప్రారంభమవగానే 'క్వశ్చన్ పేపర్ లీకేజీ' జరిగింది అని ధ్రువపరిచారు.**

డిజిటల్ పరికరాల ద్వారా జరిగిన "లైవ్ చీటింగ్ ... నకిలీ/కాపీయింగ్" అని స్పష్టం చేశారు. బాబా ఫరీద్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (BFUHS) ద్వారా జూలై 19, 2026న నిర్వహించిన ఈ పరీక్షకు సంబంధించి అసలు ఏం జరిగిందనే పూర్తి వివరాలు బయటపడ్డాయి.

### అసలు ఏం జరిగింది?

లైవ్ బ్రీచ్ గా పిలవబడే సాంకేతిక మోసం తో పరీక్ష జరుగుతున్న సమయంలోనే పేపర్ బయటకు వచ్చింది.

పరీక్ష ప్రారంభమైన తర్వాత కొందరు అభ్యర్థులు రహస్య పెన్-కెమెరాల...
Spy Pen-Cameras ద్వారా ప్రశ్నపత్రాన్ని ఫోటోలు తీసి, ఫరీద్‌కోట్‌లోని ఒక కంట్రోల్ రూమ్‌కు వాట్సాప్ ద్వారా పంపించారు.
బ్లూటూత్ ద్వారా సమాధానాలు: అక్కడి నుండి నిందితులు మైక్రో బ్లూటూత్ పరికరాల...
Micro-Bluetooth Earpieces ద్వారా పరీక్ష రాస్తున్న అభ్యర్థులకు లైవ్‌లో సమాధానాలు చెప్పారు.




### పోలీసుల దాడి

పక్కా సమాచారంతో పంజాబ్ కౌంటర్ ఇంటెలిజెన్స్, స్థానిక పోలీసులు పరీక్షా కేంద్రాలపై ఏకకాలంలో దాడులు చేసి ఈ హైటెక్ కాపీయింగ్ ముఠాను పట్టుకున్నారు.

### 35 మంది అరెస్ట్

ఈ కుంభకోణానికి సంబంధించి 7 గురు ప్రధాన సూత్రధారులతో పాటు బ్లూటూత్ డివైజ్‌లు వాడుతూ దొరికిన 28 మంది అభ్యర్థులను పోలీసులు అరెస్ట్ చేశారు.

### భారీగా వసూళ్లు:

- **పరీక్ష పాస్ చేయించడానికి అభ్యర్థుల నుండి రూ. 3.5 లక్షల నుండి రూ. 13 లక్షల వరకు ఈ ముఠా వసూలు చేసినట్లు న్యూ ఇండియన్ ఎక్స్ప్రెస్ మరియు ఇండియా టుడే వార్తా సంస్థల కథనాలు పేర్కొన్నాయి.**

### అధికారుల ప్రమేయం లేదు

ఈ వ్యవహారంలో పరీక్షా బోర్డు అధికారుల ప్రమేయం గానీ, లోపాయికారీ సహకారం గానీ లేదని ప్రాథమిక విచారణలో తేలింది.
రాజకీయ దుమారం ఈ ఘటనపై పంజాబ్‌లో తీవ్ర రాజకీయ వివాదం చెలరేగింది.

### ఆప్ (AAP) కా క్యా హోగా

పంజాబ్ పేపర్ లీకేజీ తో ఆప్ పార్టీ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా మారింది.
కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నీట్ పేపర్ లీకేజీలపై విమర్శలు చేసే ఆమ్ ఆద్మీ పార్టీ... తమ పాలనలోని పంజాబ్ రాష్ట్రంలో జరిగిన ఈ రిక్రూట్‌మెంట్ మోసంపై సమాధానం చెప్పాలని కాంగ్రెస్, బిజెపి మరియు శిరోమణి అకాలీదళ్ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.

పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ప్రతిపక్షాలు నిరసనలు తెలుపుతున్నాయి. నీట్ పేపర్ లీకేజీ జరిగింది, మళ్ళీ పరీక్షలు నిర్వహించిన తర్వాత విద్యార్థులు తమ ర్యాంకుల ఆధారంగా సీట్లలో చేరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా సత్వర చర్యలతో నష్టాన్ని నివారించింది. అయినా కేవలం రాజకీయ ఉద్దేశాలతో ఢిల్లీ వీధులలో సంఘవిద్రోహశక్తులను సమీకరించినటువంటి కొన్ని జాతి వ్యతిరేక శక్తులు అలజడి సృష్టిస్తున్నాయి. భారత పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను అడ్డుకోవడానికి నిస్సిగ్గుగా హింసను రేపి ప్రజాస్వామ్య ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయి.
కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని నీట్ అయినా... పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఫార్మసీ అధికారుల నియామక పరీక్ష అయినా ఒక్కటే కదా!..
పరీక్షల నిర్వహణలో అపశృతులు దొర్లినప్పుడు ప్రభుత్వాలు వాటిని సవరించాలి, మళ్లీ ఇటువంటి పరిస్థితులు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలి. ఈ క్రతువు సక్రమంగా జరగడానికి ప్రతిపక్షాలు నిర్మాణాత్మక సహకారం అందించాలి..

అంతేగాని భారత రాజ్యాంగ పుత్రిక అయినటువంటి శాసన వ్యవస్థలు నడవకుండా చేసి... పార్లమెంట్ శాసనసభలలో అలజడి సృష్టించి పాలనా వ్యవస్థను అవమాన పరచడం సరికాదని భారతీయులందరూ భావిస్తున్నారు.
ఈ వీధి పోరాటాలు అన్నీ కూడా భారత రాజ్యాంగ వ్యతిరేకమని సామాన్య భారతీయులు అర్థం చేసుకుంటున్నారు.
అనుత్పాదక ఉద్యమాలు శాస్త్రీయం ఎలా అవుతాయి?. అలజడులను రేపి ప్రజాస్వామ్య వ్యవస్థను కించపరచడం రాజకీయ పార్టీల కార్యక్రమాలు కాదు.

**భారత్ మాతా కి జై..జై సంవిధాన్.**

# జర్నలిస్టుల సమస్యలపై 27న "ఛలో పార్లమెంట్"

- జంతర్ మంతర్ వద్ద ఒక రోజు ధర్నా
- పోస్టర్ ఆవిష్కరించిన టీడబ్ల్యూజేఎఫ్

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, జూలై 22**

కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన జర్నలిస్టుల సమస్యల పై ఈ నెల 27వ తేదీన "ఛలో పార్లమెంట్" కార్యక్రమం చేపడుతున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు వెల్లడించారు. బుధవారం హైదరాబాద్ హైదర్ గూడలోని న్యూస్ సర్వీస్ సిండికేట్(ఎన్ ఎస్ ఎస్) లో జరిగిన మీడియా సమావేశంలో ఫెడరేషన్ అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ లు ఛలో పార్లమెంట్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుతున్నందున దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి, పార్లమెంట్ సభ్యుల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించాలని కోరుతూ ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలో పరిష్కరించాల్సిన జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్ ల పునరుద్దరణ, జర్నలిస్టుల రక్షణకు పార్లమెంట్ లో ప్రత్యేక చట్టం చేయడం, రిటైర్డ్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం, జాతీయ మీడియా కమీషన్ ఏర్పాటు, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియాకు చట్టబద్దత వంటి డిమాండ్ల ను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధనకై 27న ఢిల్లీలోని పార్లమెంట్ (జంతర్ మంతర్) వద్ద ఒక రోజు



ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు రైలు ప్రయాణ చార్జీల్లో 50 శాతం రాయితీ కల్పిస్తూ దాదాపు పదిహేనేళ్ళ పాటు కొనసాగిన రైల్వే రాయితీని కేంద్ర ప్రభుత్వం కోవిడ్ సందర్భంగా నిలిపివేసిందని, ఈ సదుపాయాన్ని తిరిగి పునరుద్దరించకపోవడంతో దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. జర్నలిస్టుల రైల్వే రాయితీ పాసులను పునరుద్దరించాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా దేశవ్యాప్తంగా మీడియా రంగం విస్తరించిన నేపథ్యంలో వివిధ సమస్యలను పరిష్కరించేందుకు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో "నేషనల్ మీడియా కమీషన్" ఏర్పాటు చేయాలని వారు కోరారు. అదేవిధంగా వివిధ రాష్ట్రాలలో అనేకమంది రిటైర్డ్, సీనియర్ జర్నలిస్టులకు ఎటువంటి ఆదాయ వనరులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయయని, కొన్ని రాష్ట్రాలలో రిటైర్డ్ జర్నలిస్టులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ స్కీం అమలు చేస్తున్నప్పటికి జాతీయ స్థాయిలో పెన్షన్ స్కీం లేకపోవడం వల్ల మిగతా రాష్ట్రాలలో ఈ స్కీం అమలుకావడంలేదని, అందుకే దేశవ్యాప్తంగా ఒకే పెన్షన్ విధానం ఉండేలా "జాతీయ పెన్షన్ పథకం" అమలు చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అనేక రాష్ట్రాలలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, హత్యలు, అక్రమ కేసులు వంటి వాటిని అరికట్టేందుకు పార్లమెంట్ లో "జర్నలిస్టుల రక్షణ చట్టం" తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలకు పూర్తి స్థాయిలో చట్టబద్దత కల్పించాలని అన్నారు. అదేవిధంగా పాత్రికేయ సంఘాలకు,
జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీలకు ప్రభుత్వ భూముల కేటాయింపును నిరాకరిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించి, దేశవ్యాప్తంగా పాత్రికేయులకు ఇళ్ళస్థలాలు కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్ల సాధనకై 27న జరిగే "ఛలో పార్లమెంట్" కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి జర్నలిస్టులు, టీడబ్ల్యూజేఎఫ్ బాధ్యులు పాల్గొంటారని, అదేవిధంగా ఢిల్లీ, యూపీ తదితర రాష్ట్రాలకు చెందిన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) నాయకులు కూడా ధర్నాలో పాల్గొంటారని తెలిపారు. ధర్నా అనంతరం
పలువురు కేంద్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మీడియా సమావేశంలో ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె. పాండురంగారవు, పి. అశోక్ కుమార్ గౌడ్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, రంగారెడ్డి జిల్లా కో-కన్వీనర్ నంబి పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్-నీనో ప్రభావం నేపథ్యంలో వరి సాగు తగ్గించి ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలి

- వెల్గటూర్ రైతు వేదికలో ఎల్-నీనోపై అవగాహన కార్యక్రమం
- ప్రకృతి వ్యవసాయం, పంట వైవిధ్యకరణతోనే రైతులకు లాభ దాయకమైన సాగు
- ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుధాకర్

**కరపత్రం ప్రతినిధి జగిత్యాల, జూలై 22**

ఎల్-నీనో ప్రభావంతో ఏర్పడుతున్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి, తక్కువ నీటితో సాగు చేసే ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని జగిత్యాల జిల్లా ఆత్మ (ఆత్మ) డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుధాకర్ సూచించారు. బుధవారం వెల్గటూర్ మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన ఎల్-నీనో అవగాహన కార్యక్రమం లో జగిత్యాల జిల్లా ఆత్మ (ఆత్మ) డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరి సాగుకు ముందు పచ్చిరొట్టె ఎరువులు వేయడం వల్ల నేలలో సేంద్రియ కార్బన్, తేమ శాతం పెరిగి ఎరువులు, నీటి వినియోగం తగ్గడంతో పాటు పంట దిగుబడి మెరుగుపడుతుందని తెలిపారు. భవిష్యత్



వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంట వైవిధ్యకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం పత్తి, కంది పంటలు తేమ ఒత్తిడికి గురవుతున్న నేపథ్యంలో 2 శాతం యూరియా, 1 శాతం పొటాషియం నైట్రేట్, లేదా 19:19:19, 13:0:45 నీటిలో కరిగే ఎరువులను ఆకులపై పిచికారీ చేయాలని సూచించారు. దీనివల్ల మొక్కలు పోషకాలను త్వరగా గ్రహించి దిగుబడి నష్టాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని వివరించారు. భూగర్భ జలాలు రోజురోజుకు తగ్గిపోతున్నందున బోర్లు, చెరువులపై ఆధారపడే వరి సాగును పరిమితం చేసి, జొన్న, పెసలు, మినుములు, కంది, పొద్దుతిరుగుడు, ఆముదం వంటి తక్కువ నీటి అవసరమున్న పంటలను సాగు చేయాలని



రైతులకు సూచించారు. మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ మాట్లాడుతూ.. ప్రస్తుత వర్షపాతం ఆధారంగా అధికంగా వరి సాగు చేయడం కంటే, అదే నీటితో మూడు ఎకరాల వరకు ఆరుతడి పంటలను సాగు చేసి మెరుగైన ఆదాయం పొందవచ్చని చెప్పారు. అలాగే ప్రతి రైతు తన పొలంలో ఫార్మ్ పాండ్ (నీటి కుంట) ఏర్పాటు చేసుకోవడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకుని, భూగర్భ జలాల పెంపుతో పాటు నీటి సంరక్షణకు తోడ్పడవచ్చని సూచించారు. కార్యక్రమం లో రైతులకు ఎల్-నీనో ప్రభావాన్ని ఎదుర్కొనే సాగు పద్ధతులు, నీటి నిర్వహణ, పంటల ఎంపికపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రవళి, ఫిర్దోస్, వెల్గటూర్ ఉప సర్పంచ్ ప్రతాప్ రావు, మాజీ ఉప సర్పంచ్ సందీప్, మండల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సును ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తి



సంఘటనను వివరిస్తున్న అసలు డ్రైవర్

**గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

కోరుట్ల బస్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి ఎత్తుకెళ్లిన ఘటన సంచలనం రేపుతుంది. కోరుట్ల బస్టాండ్లో నిలిపి ఉన్న ఆర్టీసీ బస్సును ఓ గుర్తు తెలియని వ్యక్తి దొంగలించుకొని నిజామాబాదు వైపు వెళ్తుండగా గమనించిన ఆర్టీసీ అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కోరుట్ల, మెట్ పల్లి పోలీసులు వెంబడించి ఇబ్రహీంపట్నం మండలం గండి హనుమాన్ దేవాలయం వద్ద ఆర్టీసీ బసును స్వాధీనం చేసుకుని, నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు.

# వెల్లుల్లలో ఇంకుడు గుంతల తవ్వకం ముగ్గు పోసిన ఆర్డిఓ రఘువరన్



**గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం వెల్లుల్ల గ్రామపంచాయతీలో, ఆర్డిఓ రఘువరన్ బుధవారం జలసిరి పథకంలో భాగంగా గ్రామపంచాయతీ పనులను పరిశీలించారు. ఇంటింటి ఇంకుడు గుంతలకు ముగ్గు వేయడం, ఇంటర్నల్ రోడ్ల వెంబడి మొక్కలు నాటడం, ఇంటింటికీ మొక్కల పంపిణీ వంటి పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గూడూరు తిరుపతి, కార్యదర్శి నారాయణ, ఎంపీడీవో మహేందర్, ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్ సుమన్, ఈజీఎస్ లక్ష్మయ్య, వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

# మేడ్చల్ రోడ్డుపై వరి నాట్లు బిఆర్ఎస్ వ్యంగ్య నిరసన



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

మేడ్చల్ పట్టణంలో రోడ్ల దుస్థితిపై బీఆర్ఎస్ నాయకులు వినూత్న నిరసన చేపట్టారు. జాతీయ రహదారి నుండి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే హౌజింగ్ బోర్డు కాలనీ రోడ్డు వర్షపు నీటితో నిండి చెరువులను తలపిస్తుండటంతో, స్థానిక మహిళలతో కలిసి గుంతల్లో వరి నాట్లు వేశారు. రోడ్డు బాగోలేక ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని నాయకులు మండిపడ్డారు.

# వన మహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటిన ఎస్సై జె. ఆరోగ్యం

వన మహోత్సవాన్ని పురస్కరించుకుని గౌరారం పోలీస్ స్టేషన్ ఎస్సై జె. ఆరోగ్యం ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు నాచారం అవుట్‌పోస్ట్ ప్రాంగణంలో 65 వివిధ రకాల మొక్కలను నాటారు ఈ సందర్భంగా మాట్లాడుతూ చెట్లు ప్రగతికి మెట్లు" అని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

# నాచారం గుట్టలో స్వాతి నక్షత్ర గిరి ప్రదక్షిణ

సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని నాచారం గుట్టపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి పురస్కరించుకొని గిరి ప్రదక్షిణ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు రంగంపేట పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామివారి స్వీయ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో అశేష భక్తజనవాహిని పాల్గొని, "ఓం నారసింహాయ నమః" నామస్మరణలతో క్షేత్రం మారుమ్రోగింది. దేవస్థాన కార్యనిర్వాణాధికారి బెల్లంకొండ రంగాచారి, మాజీ ధర్మకర్తల చైర్మన్ రవీందర్ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి, మాజీ ధర్మకర్తలు చందా నాగరాజు, గాలి కిష్టయ్య, కొత్తపల్లి శ్రీనివాస్, ఉషశ్రీ రాజశేఖర్ శర్మ, శేఖర్ గుప్తా, నాచారం సర్పంచ్ సారిక యాదగిరి, మార్కెట్ కమిటీ దేవస్థాన సిబ్బంది, అలాగే అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గిరి ప్రదక్షిణ అనంతరం భక్తులకు మార్కెట్ కమిటీ చైర్మన్ విట్టల్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత అల్పాహారాన్ని అందించారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం జూలై 23, 2026

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

- వరంగల్ అభివృద్ధి కార్యక్రమాల నేపథ్యంలో ఎన్ఐటీ గెస్ట్ హౌస్‌లో ఆత్మీయ ఆహ్వానం

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూలై 22**



తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ వరంగల్ పశ్చిమ నియోజక వర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బుధవారం వరంగల్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు ఎన్ఐటీ గెస్ట్ హౌస్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను, మంత్రి కొండా సురేఖను పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మాజీ మేయర్ గుండు సుధారాణితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వరంగల్ నగర అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ వరంగల్‌ను అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వారు తెలిపారు.

## శ్రీనివాస రామానుజన్ ఒలంపియాడ్ స్కూల్ లో 'లయన్స్ క్వెస్ట్' పుస్తకాల ఆవిష్కరణ - పంపిణీ







- 30 వేల మంది విద్యార్థులకు ఉచితంగా పుస్తకాల పంపిణీయే లక్ష్యం
- విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రత్యేక కార్యక్రమం
- ముఖ్య అతిథిగా జిల్లా గవర్నర్ నరహరి సుధాకర్ రెడ్డి
- ప్రముఖ సామాజిక వేత్త, విద్యావేత్త, శ్రీనివాస రామానుజన్ ఒలంపియాడ్ స్కూల్ అధినేత లయన్ డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి

**తెలంగాణ తొలి మెట్టు/బ్యూరో, జూలై 22**

విద్యార్థుల్లో నైతిక విలువలు, సేవాభావం, జీవన నైపుణ్యాలు పెంపొందించడమే లక్ష్యంగా లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'లయన్స్ క్వెస్ట్' కార్యక్రమంలో భాగంగా.., బుధవారం శ్రీనివాస రామానుజన్ ఒలంపియాడ్ స్కూల్ లో లయన్స్ క్వెస్ట్ పుస్తకాల ఆవిష్కరణ, పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా గవర్నర్ నరహరి సుధాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా, కాటంగు సుభాష్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస రామానుజన్ ఒలంపియాడ్ స్కూల్ అధినేత, లయన్స్ క్వెస్ట్ బహుళ జిల్లా సమన్వయకర్త లయన్ డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి, తొలి ఉప జిల్లా గవర్నర్ పుట్టా హరికిషన్ రెడ్డి, ద్వితీయ ఉప జిల్లా గవర్నర్ రేవూరి రామ్ మోహన్ రెడ్డి విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 6, 7, 8 తరగతుల విద్యార్థులకు లయన్స్ క్వెస్ట్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. క్వెస్ట్ ఉపాధ్యాయులు ఎన్. సులోచన, భాస్కర్ లయన్స్ క్వెస్ట్ కార్యక్రమం విశిష్టతను విద్యార్థులకు వివరించగా, ఇప్పటికే ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుని, తమలో వచ్చిన సానుకూల మార్పులను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో నైతిక విలువలు, సేవా దృక్పథం, నాయకత్వ లక్షణాలు, జీవన నైపుణ్యాలు పెంపొందించడంతో పాటు భావోద్వేగాలను నియంత్రించుకునే సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడమే లయన్స్ క్వెస్ట్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా 30 వేల మంది విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందించడంతో పాటు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. దీని ద్వారా వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును మరింత ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. జిల్లా గవర్నర్ నరహరి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు పుస్తకాల ద్వారా నేర్చుకున్న విలువలను నిత్య జీవితంలో ఆచరిస్తూ, ఆదర్శ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విలువలతో కూడిన విద్య ద్వారానే ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరంలో ఆరో, ఏడో తరగతుల్లో లయన్స్ క్వెస్ట్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు ఈ ఏడాది 7, 8 తరగతులకు చేరుకున్న సందర్భంగా వారికి రెండో సంవత్సరం పుస్తకాలను కూడా ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమం వరుసగా మూడు సంవత్సరాల పాటు 6, 7, 8 తరగతుల్లో అమలవుతుందని, ఒక విద్యార్థి 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ఈ కార్యక్రమంలో భాగస్వామి కావడం ద్వారా విద్యార్థి వ్యక్తిత్వంలో సమగ్ర సానుకూల మార్పు తీసుకురావడమే లయన్స్ క్వెస్ట్ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నియంత్రణకు సమన్వయమే కీలకం

- పరకాల సీహెచ్‌సీలో ఫీవర్ వార్డు, వ్యాక్సినేషన్, బ్లడ్ బ్యాంక్ సేవలపై సమీక్ష
- ఇంటింటి ఫీవర్ సర్వేను మరింత సమర్థంగా నిర్వహించాలని సిబ్బందికి ఆదేశం
- డీఎంహెచ్‌వో డాక్టర్ ఏ. అప్పయ్య





**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూలై 22**

సీజనల్ వ్యాధుల నియంత్రణలో అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించగలమని హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ ఏ. అప్పయ్య అన్నారు. బుధవారం పరకాల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన, కోఆర్డినేటర్ హాస్పిటల్ సర్వీసెస్ డాక్టర్ వంశీకృష్ణతో కలిసి ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫీవర్ వార్డును పరిశీలించారు. సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇంటింటి ఫీవర్ సర్వేను మరింత సమర్థవంతంగా చేపట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు. సర్వేలో జ్వరం లేదా ఇతర అనుమానాస్పద లక్షణాలు గుర్తించిన వ్యక్తులను వెంటనే సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రిఫర్ చేయాలని, అవసరమైతే మెరుగైన వైద్య సేవల కోసం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని ఆదేశించారు.

అనంతరం నిర్మాణ దశలో ఉన్న పరకాల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన పనులను పరిశీలించి, నిర్మాణాన్ని నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

తదుపరి పీపీపీ యూనిట్ పరకాలలో కొనసాగుతున్న ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుష్ (ఐఎంఐ) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌వో, వ్యాక్సిన్ నిల్వ విధానం, కోల్డ్ చైన్ నిర్వహణ, అందుబాటులో ఉన్న టీకాల వివరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన బ్లడ్ బ్యాంక్‌ను కూడా డాక్టర్ వంశీకృష్ణతో కలిసి పరిశీలించిన ఆయన, రోగులకు నాణ్యమైన సేవలు అందేలా అన్ని ప్రమాణాలు పాటించాలని సిబ్బందికి సూచించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ నరేష్ కుమార్‌తో పాటు వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఘన స్వాగతం పలికిన హనుమకొండ కిసాన్ సెల్ అధ్యక్షులు పింగళి వెంకట్రాం నరసింహారెడ్డి

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూలై 22**



హనుమకొండ జిల్లాలో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లుకి, కాంగ్రెస్ కిసాన్ సెల్ హనుమకొండ అధ్యక్షులు పింగళి వెంకట్రాం నరసింహారెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెంకట్రాం నరసింహారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేపడుతున్న పర్యటన ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లాలో చేపడుతున్న, చేపట్టిన కార్యక్రమాలు విజయవంతమవుతున్నాయని, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా ప్రభుత్వం పని చేస్తుందని పింగళి వెంకట్రాం నరసింహారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి మరోసారి హృదయపూర్వక స్వాగతం తెలిపారు.

## రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా వరంగల్‌లో మోదీ దిష్టిబొమ్మ దగ్ధం

- జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో పోచమ్మ మైదాన్ సెంటర్‌లో ఆందోళన
- విద్యార్థులపై పోలీసు చర్యను ఖండిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు





**కరపత్రం ప్రతినిధి వరంగల్, జూలై 22**

లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని పోచమ్మ మైదాన్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ అయూబ్ నాయకత్వంలో కార్యకర్తలు ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మొహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ.. నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలు, పేపర్ లీక్ అంశంపై రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో ప్రజల తరఫున ప్రశ్నిస్తుండగా ప్రతిపక్ష గొంతును అణచివేసే విధంగా మైకులు నిలిపివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్, అనంతరం వారిని అడ్డుకునే చర్యలను తీవ్రంగా ఖండించారు.

విద్యార్థులకు మద్దతుగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నేతృత్వంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు కాంగ్రెస్ ఎంపీలు, సీనియర్ నాయకులు ప్రధాని నివాసాన్ని ముట్టడించి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాను డిమాండ్ చేశారని తెలిపారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీని పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, విద్యార్థులపై జరిగిన ఘటనకు ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ యువతకు ఏటా కోట్లాది ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాల కల్పనలోనూ, పోటీ పరీక్షల పారదర్శక నిర్వహణలోనూ పూర్తిగా విఫలమైందని అయూబ్ ఆరోపించారు. ప్రజా స్వామ్య విలువలను దెబ్బతీసే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, జిల్లా, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేష్తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి

- బీసీలపై అవమానాలు, కులదూషణలు, హింసాత్మక ఘటనలను అరికట్టాలని జాతీయ బీసీ మహాసభ డిమాండ్

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, జూలై 22**



దేశ వ్యాప్తంగా బీసీ సమాజంపై పెరుగుతున్న అవమానాలు, కులదూషణలు, సామాజిక వివక్ష, హింసాత్మక ఘటనలను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ప్రత్యేక 'బీసీ రక్షణ చట్టం' తీసుకురావాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీలపై కులదూషణలను శిక్షార్హ నేరంగా గుర్తించి కఠిన శిక్షలు అమలు చేసేలా చట్టాలను రూపొందించాలని కోరారు. అలాగే ప్రతి జిల్లాలో ప్రత్యేక బీసీ రక్షణ సెల్ ఏర్పాటు చేసి, బీసీలపై జరిగే వివక్ష, దాడులపై తక్షణ చర్యలు తీసుకునే వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు.

బీసీ మహిళలపై జరుగుతున్న అవమానాలు, దాడుల కేసులను వేగంగా విచారించేందుకు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలని సూచించారు. కులగణన ఆధారంగా విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో బీసీలకు వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా ప్రాతినిధ్యం కల్పించాలని ప్రభుత్వాలను కోరారు.

తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్‌లు, బీసీ సంక్షేమ పథకాల నిధులను తక్షణమే విడుదల చేసి విద్యార్థులు, యువతకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల నుంచి శాసనసభ, పార్లమెంట్ వరకు బీసీలకు సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాము చేపడుతున్న బీసీ ఉద్యమం ఏ వర్గానికీ వ్యతిరేకం కాదని, రాజ్యాంగం కల్పించిన సమాన హక్కులు, సామాజిక న్యాయం, బీసీల ఆత్మగౌరవ పరిరక్షణే లక్ష్యమని రాజేందర్ పటేల్ గౌడ్ స్పష్టం చేశారు. హక్కుల సాధన కోసం బీసీలందరూ ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

## నీట్ పేపర్ లీక్‌పై పార్లమెంట్ వద్ద విపక్షాల నిరసన

- విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య
- ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్




**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూలై 22**

దేశవ్యాప్తంగా సంచలనం రేపిన నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బుధవారం పార్లమెంట్ ఆవరణలో విపక్ష ఎంపీలు నల్ల దుస్తులు ధరించి ఆందోళన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా డా. కడియం కావ్య మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడే ఘటనలను దేశ ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరని అన్నారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై సమగ్ర, పారదర్శక విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం ఆందోళన చేస్తుంటే, వారి సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం పోలీసులతో అణచివేతకు పాల్పడడం అత్యంత దురదృష్టకరమని ఎంపీ విమర్శించారు. విద్యార్థుల గొంతును అణిచివేయడం కాకుండా, వారి ఆందోళనలకు తక్షణ పరిష్కారం చూపాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డా. కడియం కావ్య డిమాండ్ చేశారు.

విద్యార్థుల హక్కులు, వారి విద్యా భవిష్యత్తు పరిరక్షణ కోసం పార్లమెంట్ లోపల, బయట తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఎంపీ స్పష్టం చేశారు. నీట్ వంటి జాతీయ స్థాయి పరీక్షల విశ్వసనీయతను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు.

## రోడ్డుప్రమాద మృతుడి కుటుంబానికి సాయం

**– రూ. 2 లక్షల ప్రమాద బీమా చెక్కును అందచేత**

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన కేటీ దొడ్డి మండలం కుచ్చినెర్ల గ్రామానికి చెందిన మల్లేశ్ కుటుంబానికి ఎస్‌బీఐ మేనేజర్ సాయిరాం రూ. 2 లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మల్లేశ్ తల్లి సత్యమ్మకు బీమా చెక్కును అందించి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ మేనేజర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై), ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంఏజేబీవై) పథకాల్లో చేరాలని సూచించారు. స్వల్ప ప్రీమియంతో లభించే ఈ బీమా అపద సమయంలో కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలు బీమా పథకాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ సర్వీస్ మేనేజర్ ఎన్. రామకృష్ణ, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.